

# డాక్టర్‌గారి భార్య

## – కొమ్మూరి వేణుగోపాలరావు



(గత సంచిక తరువాయి)

**తలుపు తెరవగానే ఇద్దరు** ముగ్గురు మనుషులు ఓ చంటిపాపతో కనిపించారు. ఆ పాపకి డయేరియా. రెండు మూడు రోజులనుంచీ ఏవేవో మందులు వాడి, తగ్గకపోగా సీరియస్ అయితే తీసుకొచ్చారు. పాప సివియర్‌డ్ హైడ్రేషన్‌లో వుంది. కళ్ళెక్కడికోపోయి, ఓ జీవకళ లోపించి శరీరమంతా శుష్కించి, చివరిదశలో వుంది. కష్టం మీద ఆ పాపను గుర్తుపట్టాడు. ఆనాడు బేబీషోలో తాను ఫస్ట్ ప్రైయిజ్ ఇచ్చిన పాపం. నాలిక తడి ఆరిపోయి, పెదాలు ఎండిపోయి హృదయ విదారకంగా మూలుగుతోంది.

"ఇప్పటిదాకా ఏం చేశారు?" అనడిగాడు.

"అక్కడెవరో చిన్న డాక్టరుంటే వాడాం బాబూ! ఇప్పటిదాకా చూసి లాభం లేదు తీసుకుపొమ్మనారు" అన్నాడు పాప తండ్రి.

నరేష్ చూశాడు. వెంటనే ఫ్లూయిడ్స్ మొదలు పెట్టాలి. వెయిన్ దొరుకుతుందనే నమ్మకం లేదు. వెన్ సెక్షన్ చెయ్యాలి. అంటే చర్మం కోసి వెయిన్ పట్టుకుని, దానికో చిన్న రంధ్రం అతి సున్నితంగా చేసి, అందులోంచి పాలిథి దోపి, ఆ పాలిథిన్ ట్యూబ్‌కు సెలైన్ సెట్ కనెక్ట్ చెయ్యాలి. హౌస్ సర్జన్సీ చేసేటప్పుడు పెడియాట్రికి వార్డ్‌లో పనిచేసేటప్పుడు కొన్నిసార్లు చేశాడు. అప్పుడైతే ప్రక్కన ఇంకా ఒకరిద్దరు హౌస్ సర్జన్స్ సాయం వుండేవారు. అప్పటికి కుదరకపోతే ఏ అసిస్టెంట్ ప్రొఫెసర్నో వెళ్ళి కోరితే ఆయన సహాయం వుండేది. ఇక్కడ అలాకాదు. ఒంటరిగా పోట్లాడాలి. ఏ కాంప్లికేషన్ వచ్చినా తనకు తాను తప్ప సాయం వుండదు. అంతేకాక విజయం లభించటమూ, లేక ఓడిపోవటమూ డాక్టర్ చాతుర్యం, సమర్ధత మీద కాక అపేషెంటు శరీర స్థితి మీద ఆధారపడివుంది. అంత డిహైడ్రేషన్‌లో వెయిన్స్ దాదాపు కొలాప్స్ అయివుంటాయి. చాలా సన్నగా, క్యాచ్ చేయటానికి వీలులేనట్లుగా వుంటాయి. ఇంత కష్టపడినా ప్రయోజనం వుండకపోవచ్చు. గవర్నమెంట్ హాస్పటలయితే కేసు ఫెయిలయినా అక్కడిదారి వేరు – ఇది ప్రయివేట్ ప్రాక్టిస్. తెలియక, లేక ముంచుకొచ్చే ప్రమాదాలకు చేసేదేమీ లేదుకానీ, తెలిసి ప్రమాదంలోకి జొరబడటానికి ఒకటికి పదిసార్లు ఆలోచించాలి.

"గవర్నమెంటు హాస్పటల్‌కి తీసుకెళ్ళండి" అన్నాడు ఆలోచించి.

పిల్లతల్లి ఏడుస్తోంది "మీ పేరు చెబితే వొచ్చాం బాబూ! ఎంతో ఆశపెట్టుకుని వచ్చాము, కాదనకండి బాబూ" అంది.

"కాని కేసు చాలా సీరియస్‌గా వుంది."

"మేము చేతులారా చేసుకున్నదానికి మీరేం చేస్తారు బాబూ  మీ ప్రయత్నం మీరు చెయ్యండి. కాదనకండి బాబూ" అన్నాడు తండ్రి.

వెనకనుండి సహజ వచ్చింది. "ఏమిటి సమస్య?" అని అడిగింది.

అతను వివరించాడు. అర్ధరాత్రి కాన్సంట్రేషను కుదరకపోవచ్చు. అందులో స్టాఫ్ ఎవరూ లేరు. అందునా ప్రాక్టీస్ పెట్టాక ఇంతవరకూ చెయ్యలేదు.

"ఆల్టర్నేటివ్ ఏమిటి?"

"చేస్తే వెన్ వెర్షన్ చేసి బ్రతికించటానికి ప్రయత్నించటం, లేకపోతే చావు."

"బయటికి ఎక్కడికయినా తీసుకెడితే?"

"వాళ్ళు ఇంతకన్నా ఏమీ చెయ్యలేరు."

"అయితే ఆ ప్రయత్నం మనమే చేద్దాం."

"సాయం చెయ్యటానికి..."

"నేనున్నానుగా – మీరు చెబుతూ వుండండి, నేను చేస్తూ వుంటాను."

నరేష్ ఇంకోసారి ఆలోచించాడు. బేబీ షో రోజు ఫస్ట్ ప్రైయిజ్ పొందుతున్నప్పుడు చూసిన పాప ముఖమే కనబడుతోంది మనసులో.ఇలాంటి కేసులు చేసేటప్పుడు సమర్ధతతోబాటు అపరిమితమైన శ్రద్ధ కావాలి.

ఫ్లూయిడ్స్ అనగానే ఏదో ఒకటి పెట్టేయటం కాదు – అవసరాన్ని బట్టీ, పరిస్థితిని బట్టీ ఓసారి డెక్ స్ట్రీస్ సెలైన్, లేకపోతే ప్లెయిన్ సెలైన్, ఫింగ లాక్టేట్, మోలార్ లాక్టేట్, సోడియం బై కార్బొనేట్ – ఎసిడోసిన్ ఆల్కడోసిన్ చూస్తుకుంటూ ఫ్లూయిడ్స్ మార్చుకుంటూ ట్రీట్ చెయ్యాలి. పేషెంటు విషమ పరిస్థితుని గురించి ఇంకోసారి చెప్పాడు. ఫలితం ఏమయినా సిద్ధమేనని, అతను కేసు తీసుకుంటే చాలుననీ అన్నారు.

టైములేదు. చకచక ఏర్పాటు పూర్తిచేసుకున్నాడు. ఎందుకైనా మంచిదని ఇదివరకే పాలిథిన్ ట్యూబ్ తెప్పించి వుంచుకున్నాడు పేషెంట్సుకు రెండు సెలైన్ బాటిల్స్ రాసిచ్చి అర్జంటుగా తెప్పించాడు.

పాలిథిన్ ట్యూబ్ ముందే కత్తిరించి వుంచి, నీడిల్ ఎక్కించి సిద్ధంగా వుంచుకున్నాడు. వెయిన్ ట్యూబ్ వుంచాక, నీడిల్ ఎక్కించటం కష్టమవుతుంది.

ఇన్స్ట్రిమెంట్సన్నీ రెడీ చేసుకుని, చేతులు వాష్ చేసుకుని పాపని టేబుల్ మీద పడుకోపెట్టమని చెప్పాడు. అంతకుముందే పెరాల్డిషైడ్ టూ సి.సి దాకా ఇచ్చాడు. నిద్రరావటానికి. కాని బాగా డీహైడ్రేషన్‌లో వుండడంవల్ల మత్తు

రావటంలేదు. కొంతమంది కొద్దిగా డైజిఫాం ఇంజక్షన్ చేస్తారు. చేద్దామనిపించిందికానీ, మళ్ళీ రెస్పిరేటరీ ఫెయిల్యూర్ వస్తుందని భయపడి వూరుకున్నాడు.

సహజ తలుపులు మూసి వచ్చి తాను కూడా చేతులు వాష్ చేసుకుని వచ్చింది.

కాలి మడమ దగ్గర కొద్దిగా జైలకైన్ ఇంజక్ట్ చేసి, స్కాల్‌పెల్‌తో అడ్డంగా ఇన్‌సషనిచ్చాడు. అలవాటు లేకపోవటం వల్ల చేతులు కొంచెం వణుకుతున్నాయి. బ్లీడింగ్ వస్తే సహజ కాటన్‌తో తుడుస్తోంది. పాప అటూ ఇటూ కదుల్తూ, మూలుగుతూ ఇబ్బంది కలిగిస్తోంది. ఆపటం కష్టంగా వుంది. దాహానికి అలమటిస్తూ నాలిక జాస్తోంది. ఆర్టరీ ఫోర్ సెప్స్‌తో చర్మం బాగా వెడం చేశాడు. కొంచెం సేపు అవస్థపడ్డాక సెఫానస్ వెయిన్ కనిపించింది. కాని వెయిన్ వుండవలసినంత ధృఢంగా, నీలంగా లేదు. కష్టం మీద ఆర్టరీ ఫోర్ సెప్స్‌ను వెయిన్ క్రిందనుంచి జొనిపి, జాగ్రత్తగా టిష్యూ నుంచి వేరుచేశాడు.

వెయిన్ ప్రక్కన ఇంకా పొరలు పొరలుగా అంటుకుని వుంటే స్యూచర్ నీడిల్‌ని వెనక్కి త్రిప్పి వెయిన్ కట్ కాకుండా జాగ్రత్తపడుతు క్లీన్ చేశాడు. వెయిన్ క్రిందనుంచి ఎన్యూరిజం నీడిల్ జొనిపి థ్రెడ్ దూర్చి, మళ్ళీ వెనక్కిలాగాక్ ఆ థ్రెడ్‌ని రెండు ముక్కలుగా కట్ చేశాడు. రెండు ముక్కలనూ వెయిన్ కపిపిస్తున్నంతమేరా ఒకటి పైకీ, ఇంకోటి క్రిందకీ విడదీసి క్రింద బాగమంతా వెయిన్ అడుగు భాగాన ముడివేశాడు అంతే. క్రిందనుంచి ప్రవహిస్తున్న వీనస్ సర్క్యులేషన్ ఆగిపోయింది. వెయిన్ క్షణంలో తెల్లగా అయిపోయి ఇప్పుడసలు కనబడటంలేదు. రక్తం ట్రిబ్యులరీన్ ద్వారా ప్రక్కలనుంచి ప్రవహించి పైన కొంచెం దూరంలో మళ్ళీ వెయిన్‌లో కలుస్తుంది.

పైన వున్న థ్రెడ్ భాగం సాయంతో వెయిన్‌ని కొంచెం ఎత్తి పట్టుకోమన్నాడు .ఫైన్ సిజర్స్ తీసి చేతిలో పట్టూకోమన్నాడు.

"జాగ్రత్త సహజా! ఇదే ముఖ్యమైన ఘట్టం. పాప కదలకూడదు. వెయిన్‌ని కట్ చేస్తూ చిన్న హోల్ చెయ్యాలి. పాప కదిల్తే వెయిన్ మొత్తం కట్ అయిపోతుంది" అని హెచ్చరించాడు.

లైట్ ఫోకస్ సరిపోవటంలేదు.

సహజ ఒక చేత్తో థ్రెడ్ పట్టుకుని ఒకచేత్తో పాపని కదలకుండా వుంచడానికి ప్రయత్నిస్తోంది.

నరేష్ పొజిషన్ చూసుకున్నాడు.

పాప కదలకుండా వున్న మూమెంట్ కనిపెట్టి జాగ్రత్తగా, చాలా జాగ్రత్తగా పాలిథిన్ ట్యూబ్ కన్నా సన్నగా వున్న వెయిన్‌ని కట్ చేశాడు. చిన్న బ్లోడింగ్ పాయింట్‌లా వచ్చింది.

"కట్ అయిందంటావా?" అన్నాడు అనుమానంగా.

"అయింది."

పాప ప్రాణం యీ పాలిథిన్ ట్యూబ్ లోపలికి దూరటం, దూరక పోవటం మీద ఆధారపడివుంది.

మరో అయిదు నిమిషాలు ప్రయత్నించాడు. ఫలించకపోగా వెయినంతా పగిలిపోయి, పైదాకా చీలిపోయినట్టయింది.

"లాభంలేదు" అన్నాడు నిరాశగా.

ఉన్నట్టుండి పాప కదలకుండా పడుకుంది.

"నిద్రపోయిందా?" అంది సహజ.

"కొంపతీసి.." అంటూ పల్స్ చూశాడు. ఉంది. కాని ఇందాకటి కన్నా ఇంకా బలహీనంగా వుంది. ఎక్కువ టైము లేదు. ఇరవై ముప్పయి నిమిషాల్లో ఏదో ఒకటి చేసెయ్యాలి.

"ఈ వెయిన్ ఇంక పనికిరాదు" అంటూ స్యూచర్స్ తర్వాత వెయ్యవచ్చు. టైము కలసి వస్తుందని బ్యాండేజి చేశేశాడు.

ఈసారి ఎక్కడ ట్రై చెయ్యాలి? రెండో కాలికా? ఎందుకో వద్దు అనిపించింది. డార్స్మ్ ఆఫ్ ది హ్యాండ్ దగ్గర పట్టుకుని చూశాడు. సెఫాలిక్ వెయిన్‌గానీ, బేసిలిక్ వెయిన్‌గానీ ప్రయత్నించవచ్చునేమోనని. కాని అవి ఇంకా సన్నగా వుంటాయి, వృధా ప్రయాస, టైము గడిచిపోతుందనుకున్నాడు. మోచేతి మడత దగ్గర ప్యీపుటల్ ఫోసాలో చూడాలనిపించింది. స్పిరిట్‌తో క్లీన్ చేసి యిన్‌సిషనిచ్చాడు. కొంచెం ఫాట్ వుంది. అది తొలగించుకుంటూ లోపలికి వెళ్ళాక మీడియన్ క్యూబిటల్ వెయిన్ కనిపించింది. ఇదికూడా సన్నగానే ఉంది. పాప మళ్ళీ కదులుతోంది. మూలుగు మరీ బలహీనమై అంతిమ క్షణాల్లో వచ్చే శబ్దంలా ఉంది.

వెయిన్ కట్ చేశాడు. లీడింగ్ రాలేదు కాని కట్ అయినట్లు తెలుస్తోంది.

పాలిథిన్ ట్యూబ్ చేతిలోకి తీసుకున్నాడు. కాని ఆత్మ విశ్వాసం సన్నగిల్లింది చెయ్యి వణుకుతుంది. నుదుటన చెమటలు పడుతున్నాయి. ఇప్పటికే పావుగంట గడిచిపోయింది .ఈసారి ఫెయిలయితే ఇహ చెయ్యలేదు. బయట పేషెంటు తాలూకు వాళ్ళు కూడా ఆలశ్యమైన కొద్దీ అసహన స్థితిలోకి వచ్చేస్తారు. మొదట "మీ చేతుల్లో పెడుతున్నాం బాబూ ఏమయినా ఫర్వాలేదు" అంటారు. కాని కేసు టేకప్ చేసినప్పట్నుంచీ డాక్టర్ ఏదో మిరకిల్ చేస్తాడని ఎదురుచూస్తూ క్షణక్షణం ప్రశ్నలు కురిపిస్తూ ఉంటారు.

"నువ్వు ట్రై చెయ్యి సహజా!"

"నేనా?"

"అవును. సూదిలోకి దారం ఎక్కించే నేర్పు పురుషుడికన్న స్త్రీకి ఎక్కువగా ఉంటుంది. ఇక్కడా ఇలాంటి టెక్నిక్కే అవసరమవుతుంది."

సహజ అతని ముఖంలోకి చూసి ఆందోళన గ్రహించింది. టేబుల్‌కు ఇటు తిరిగి వచ్చి పాలిథిన్ ట్యూబ్ చేతిలోకి తీసుకుంది. వెయిన్‌లో సూదిమొన అంత రంధ్రం కనిపించీ కనిపించనట్లు మెరుస్తోంది. పాలిథిన్ ట్యూబ్ చివర సిజర్స్‌తో

ఇంకా మొనతేలి ఉండేటట్లు కత్తిరించింది. నరేష్ ఒక చేత్తో పైథ్రెడ్‌ని పట్టుకుని వెయిన్ ఆమెకు కనిపించేలా చేస్తూ, ఇంకోచేత్తో పాపని కదలకుండా పట్టుకున్నాడు. సహజ నిశితంగా చూస్తూ పాలిథిన్ ట్యూబ్ వెయిన్ రంధ్రం దగ్గర ఉంచి ఒడుపుగా లోపలకు తోసింది ట్యూబ్ తిన్నగా లోపలకు వెళ్ళిపోయింది.

నరేష్ సంతోషం పట్టలేకపోయాడు "జాగ్రత్త! వదలకు. ఇంకొంచెం లోపలకు పోనియ్యి" అన్నాడు. సంతోషం వల్ల గొంతు గాద్గదికమైంది.

సహజ పాలిథిన్ ట్యూబ్‌ని ఇంకొంచెం లోపలకు పోనిచ్చింది. అందులోంచి రక్తం నిదానంగా బయటకు వచ్చి వెనకవైపు దూర్చివున్న నీడిల్ ద్వారా బొట్లు బొట్లుగా పడుతోంది.

నరేష్‌కి ఆనందంతో కేకలు వేయాలనిపించింది. తన చేతిలోవున్న థ్రెడ్‌తో వెయిన్‌లో వున్న ట్యూబ్ బయటకు రాకుండా గట్టిగా ముడివేశాడు. ముడి ధృఢంగా పడిందన్న నమ్మకం కుదిరాక రెండుమూడు ప్లాస్టర్లు ట్యూబు మీదుగా చేతికి గబగబ వేసేసి సెలైన్ సెట్‌ని నీడిల్‌కు కనెక్ట్ చేశాడు. చుట్టూవున్న రక్తం తుడిచాడు.

సెలైన్ బొట్లు బొట్లుగా ప్రవహించసాగింది.

"హమ్మయ్య" అని ఊపిరి పీల్చుకున్నాడు. జాగ్రత్త కోసం పైన చేతి చుట్టూ బ్యాండేజి వేశాడు.

ఎంత థ్రిల్! ఎంత తృప్తి కలిగిందో.

చేతులు కడుక్కుని తలుపులు తెరిచి బయట ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్న తలిదండ్రులను లోపలకు పిలిచాడు.

ఓ పావుగంట తర్వాత ఇంట్లోకి వెళ్ళాక నీరసంగా, వాడిపోయి ఉన్న భర్త ముఖంలోకి చూస్తూ సహజ దిగులుగా నవ్వింది. కాని ఆ దిగులులో తృప్తి ఉంది.

"మీరు చాలా అలసిపోయారు" అంది.

"నువ్వుకూడా."

"టీ కాచి ఇవ్వనా?"

అతను తల ఊపాడు.

తర్వాత నాలుగయిదు గంటలలోపు చిన్న చిన్న కాంప్లికేషన్లు వచ్చినా పాప బ్రతికింది.

పేద ప్రజల్లో ఒక కేసు సక్సెస్ అయితే చాలు, వాళ్ళు పదిమందికీ ఘనంగా చెప్పుకుంటారు. ప్రచారం బాగా చేస్తారు.

అప్పట్నుంచీ అతని దగ్గరకు పేషెంట్స్ రావటం ఎక్కువయింది.

సీరియస్ కేసులు టేకప్ చేస్తేనేగాని పేషెంట్స్ రావటం ఎక్కువయింది.

సీరియస్ కేసులు టేకప్ చేస్తేనేగాని ప్రాక్టీస్ పెరగదని గ్రహించాడు. రిస్క్, టెన్షన్ వున్నా తప్పటంలేదు. ప్రతి సీరియస్ కేసూ అక్కడకు తీసుకెళ్ళండి, ఇక్కడికి తీసుకెళ్ళండి అంటూవుంటే మిగిలేవేమీ ఉండదు. ఎలాగూ సర్జరీ చేయటంలేదు. మైనర్ సర్జరీ, ఒక్కోసారి డి అండ్ సి తప్పటం లేదు. మేజర్ సర్జరీ టేకప్ చెయ్యటంలేదు. డాక్టర్ విష్ణుమూర్తి అనే సర్జన్‌తో పరిచయమయింది. అంతకుముందు ఇద్దరు ముగ్గురు సర్జన్స్‌తో ఆపరేషను కేసులు రిఫర్ చేసి ప్రయత్నించాడుగాని, వాళ్ళ డయాగ్నిసిస్‌గాని, రెస్పాన్స్‌గాని సుఖమనిపించలేదు.

ఎందుకంటే అతని దగ్గరకొచ్చే పేషెంట్లు సర్జరీకి అతను ఇంకొకరి దగ్గరకు పంపించినా అతని దగ్గరకు వచ్చినవారు అతనిమీదే ఎక్కువగా ఆధారపడతారు. తమ సందేహాలనూ, భయాలనూ పంపించిన డాక్టరునే అడుగుతూ ఉంటారు. అంతేగాక ఆ కేసు గురించిన వివరాలు తెలుసుకోవాలని ఎకడమిక్ ఇంట్రెస్ట్ కూడా ఉంటుంది. డాక్టరు విష్ణుమూర్తితో నరేష్‌కు చాలా సౌకర్యంగా ఉంది. దయాగ్నసిస్ గురించిగానీ, కేసు ప్రోగ్రెస్ గురించిగాని చర్చించటం, అతనికి ఉత్పత్తి అవుతున్న సందేహాలను తీర్చటం – విష్ణుమూర్తికూడా చాలా శ్రద్ధ కనబరిచేవాడు. పేషెంట్లు కూడా తృప్తిపడేవారు.

నరేష్ ఓ పాలసీ పెట్టుకున్నాడు. తనమీద ఎంత ఆశ పెట్టుకుని అయనా రానీ – తనకి అలవికాని కేసులు, చెయ్యలేని కేసులు టేకప్ చెయ్యకూడదు. హార్టు కేసులు ముట్టుకోవటంలేదు. ఎందుకంటే తన దగ్గర యి.సి.జి మెషిన్ లేదు. ఆ కేసులు సాధారణంగా చెయ్యదగ్గ నాలెడ్జి లేదు. అందుకని వారికి ఎక్కడైతే సరి అయిన ట్రీట్‌మెంట్ లభిస్తుందనిపిస్తుందో అక్కడికి పంపించేస్తున్నాడు. పేషెంటుకు ఏ మాత్రం అన్యాయం జరక్కూడదని అతని ఉద్దేశం.

ఎక్కువగా పిల్లల కేసులు వస్తున్నాయి. వైరల్ ఫీవర్స్, మేనింజైటిస్‌లు, ఎన్‌కెఫలైటిస్‌లు, డయేరియా సరేసరి.

కనీసం అయిదారు బెడ్స్ లేకపోతే ట్రీట్‌మెంట్ చెయ్యటం కష్టంగా ఉంది. ఓపిగ్గా వెదగ్గా దగ్గర్లోనే ఓ చిన్న యిల్లు దొరికింది. కాపురం అందులోకి మారి పాతయింట్లో ఏర్పాటంతా అటూ ఇటూ మార్చి అయిదు బెడ్స్ దాకా ఇరికించారు. కాంపౌండర్‌తోపాటు ఇంకో నర్సునికూడా పెట్టుకున్నాడు.

దిగితేగాని లోతు తెలీదు. లోతుకు పోయిన కొద్దీ ఎన్ని రకాల కేసులు.

మొదట మామూలు జ్వరమనిపిస్తుంది. తగ్గకుండా సతాయిస్తూ ఉంటుంది. ఇన్‌వెస్టిగేషన్స్, బ్లడ్‌టెస్ట్‌గానీ, యూరిన్ కల్చర్‌గాని ఏమీ కనబడదు. ఉన్నట్లుండి మెనింజైటిస్‌లోకి వెడుతుంది. నెక్ రిజిటిడీ, వాంతులు అవీ చూడగానే గబగబ సెరిబ్రోనస్ ఫ్లూయిడ్ తియ్యటం, ట్రీట్‌మెంట్ మార్చటం టెన్షన్ మొదలవుతోంది. ఒక్కోసారి ట్రీట్‌మెంట్‌కు రెస్పాన్స్ ఉంటుంది – ఒక్కోసారి ఉండదు.

COMMENTS

(కొనసాగింపు వచ్చే నెలలో)